## ట్రినిటీలో ఎల్లో డే వేడుక



ఎల్లో రంగు దుస్తుల్లో అలరిస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి కమాన్, ఆగస్టు 10 : పెద్దపల్లి ట్రినిటీ ప్రైమరీ స్కూల్‌లో శనివారం రే ఆఫ్ షైన్ పేరుతో ఎల్లో డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లో డే ప్రాముఖ్యతను తెలిపే విధంగా వేదికను అలంకరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఎల్లో డే విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతి ప్రసాదించిన వివిధ వర్ణాల ప్రాముఖ్యతను వివరించి, వాటి ప్రభావం మానవాళిపై ఏ విధంగా ఉంటుందో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిలిటెన్ స్టిక్స్ వాడకంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జగదీశ్వరావు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 10: పెద్దపల్లి జిల్లాలో అనుమతులు లేకుండా క్వారీల్లో అక్రమంగా ఎలక్ట్రికల్ జిలిటెన్ స్టిక్స్, ఎలక్ట్రికల్ డిటోనేటర్లు వినియోగించి పేలుళ్లకు పాల్పడుతున్న యజమానులపైన చర్యలు తీసుకోవాలని ముత్తారం సింగిల్ విండో మాజీ డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బండ క్వారీల్లో పెద్దఎత్తున మందు గుండు సామగ్రితో పేలుళ్లు చేయడం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా క్వారీ యజమానులు ఇష్టంవచ్చినట్లు పేలుడు పదార్థాలు వినియోగించడం వల్ల రైతుల వ్యవసాయ పొలాల్లో బండలు పడి దిగుబడి నష్టపోతున్నారని, దీంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చెందారు. పెద్దఎత్తున భయంకరమైన పేలుళ్లతో ధ్వని కాలుష్యంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి ధర్మారం మండలం రచ్చపల్లి, పెద్దపల్లి మండలం బొంపల్లి, పాలకుర్తి మండలం జీడీ నగర్, పాత కన్నాల, జయ్యారం, రామగిరి మండలం బేగంపేట్, గ్రామాల్లో విచ్చలవిడిగా క్వారీలో వాడుతున్న జిలిటెన్ స్టిక్స్ అరికట్టాలని, క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఒక మోటర్ ద్వారా కొనసాగుతున్న నీటి ఎత్తిపోతలు

ధర్మారం, ఆగస్టు 10: ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లింక్–2 నుంచి కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుబంధ 6వ ప్యాకేజీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ నుంచి గోదావరి జిలాల ఎత్తిపోతలు గత నెల 27వ తేదీ నుంచి కొనసాగుతున్నాయి. 5వ నంబర్ మోటర్ ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నాయి. 3,150 క్యూసెక్కుల చొప్పున జలాలు పంప్‌హౌస్ నుంచి నంది రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు. రిజర్వాయర్ ద్వారా అదే పరిమాణంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలుతాయి. అక్కడి నుంచి బాహుబలి మోటర్లను ఆన్ చేయడంతో శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీళ్లు తరలి వెళ్తున్నాయి.

## ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్

సుల్తానాబాద్ రూరల్, అగస్టు 10: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసుకను అక్రమంగా లారీల్లో తరలిస్తున్నారనే సమాచారం మేరకు సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి శివారులో శనివారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. అనంతరం ఇసుకను లారీలలో నింపుతున్న ఎక్స్‌కవేటర్, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

















